TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 204 | శుక్రవారం 17-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

# 9వ తరగతిలో మూడో భాష వద్దు: సుప్రీంకోర్టు



2లో

## హర్మూజ్ దాటే నౌకల్లో భారతీయుల్ని నియమించుకోవద్దు: కేంద్రం కీలక అడ్వైజరీ



పశ్చిమాసియాలో మరోసారి తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. హర్మూజ్ జలసంధి లో ప్రయాణిస్తోన్న నౌకలపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. హర్మూజ్ దాటే నౌకల్లో భారతీయులను నియమించుకోవద్దని షిప్ యజమానులను ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న భద్రతాపరమైన ఆందోళనల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

2లో

## నీట్ (యూజీ) రీ-టెస్ట్ ఫలితాలు విడుదల..





దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ- 2026 పునఃపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను ఎన్‌టీఏ (చీూా) గురువారం రాత్రి ప్రకటించింది. విద్యార్థులు ఈ కింది లింక్‌పై క్లిక్ చేసి తమ వివరాలను ఎంటర్ చేయడం ద్వారా స్కోరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దాదాపు 20లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయగా.. 11.21 లక్షల మంది అడ్మిషన్లకు అర్హత సాధించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 66 నగరాల నుంచి 138మంది టాప్ ర్యాంకులు సాధించారని తెలిపింది. మొత్తం 720 మార్కులకు గాను 705కు పైగా మార్కులు సాధించి 17 మంది టాపర్లుగా నిలిచారు.

2లో



# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన

## 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' యాజమాన్యం

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' యాజమాన్యం.
- టీజీ20 లీగ్ తొలి విజేత జట్టుకు సీఎం అభినందనలు.
- జట్టు సభ్యులకు చెక్కులు అందజేసిన సీఎం.
- టీజీ20 లీగ్‌కు అంతర్జాతీయ స్థాయి ఆదరణ లభించిందన్న రేవంత్.
- యువ క్రికెటర్ల ఎదుగుదలకు టీజీ20 లీగ్ ఉపయోగపడుతుందని వ్యాఖ్య.
- ఆటపై కమిట్‌మెంట్‌తోనే సచిన్‌లాంటి దిగ్గజాలు ఎదిగారని సూచన.
- క్రీడాకారులకు ఈనాడు--ఈటీవీ సంస్థల అండ ఉంటుందని పేర్కొన్నారు.

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజమాన్యం కలిసింది. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఈ ఛాంపియన్స్ జట్టు సభ్యులు ఉన్నారు. తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు. అనంతరం జట్టు సభ్యులకు చెక్కులను అందజేశారు.

### టీజీ 20 లీగ్‌కు మంచి ఆదరణ దక్కింది: సీఎం రేవంత్

ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. టీజీ20 లీగ్‌కు అంతర్జాతీయ మ్యాచ్‌ల తరహాలో మంచి ఆదరణ దక్కిందన్నారు. "క్రికెట్‌లో యువత ఎదిగేందుకు ఈ లీగ్ బాగా ఉపయోగపడుతుంది. ఆటపై చూపిన కమిట్‌మెంట్ వల్లే సచిన్‌లాంటి వాళ్లు ఆ స్థాయికి ఎదిగారు. 'ఈనాడు', 'ఈటీవీ' సంస్థలు మీ వెనుక నిలబడ్డాయి. క్రికెటర్లకు ఈ సంస్థలు వెయ్యి ఏనుగుల బలంతో పాటు ఎదగడానికి కావాల్సిన అన్నింటినీ ఇస్తాయి. గతంలో క్రికెటర్లకు ఇలాంటి సంస్థల అండ లభించలేదు. దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు



- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ

గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు.

## గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ క్షమాపణ చెప్తోంది: మంత్రి నారా లోకేశ్



అమరావతి: అమరరాజా గ్రూప్ సీఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ క్షమాపణ చెప్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరరాజా సంస్థను గత ప్రభుత్వం వేధింపులకు గురి చేయకుండా ఉండాల్సిందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో లోకేశ్ పోస్ట్ చేశారు.

2లో

# జగన్నాధ రధయాత్రలో అపశృతి



పూరీ, జూలై 16: ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా గ్రాండ్ రోడ్డులో భారీ రద్దీ కారణంగా తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 100 మందికి పైగా భక్తులు గాయపడ్డారు.

**తొక్కిసలాటలో ఊపిరాడక ఒకరు మృతి**

**పందమందికి పైగా భక్తులకు గాయాలు**

- గాయపడిన వారిని సహాయక సిబ్బంది వెంటనే ఆసుపత్రులకు తరలించారు. రద్దీ కారణంగా ఓ భక్తికి ఊపిరాడక స్పృహ తప్పగా, జిల్లా ఆసుపత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

2లో








- భారీ రద్దీతో తొక్కిసలాట ఒక భక్తి మృతి
- 100 మందికి పైగా గాయాలు
- గాయపడిన వారికి చికిత్స
- భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు

## నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం: రామ్మోహన్ నాయుడు





దిల్లీ: నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉడాన్ 2.0 పథకం అమలు తీరుతెన్నులపై వర్క్‌షాప్‌లో పాల్గొన్న అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు.

2లో

## ఆక్వా రైతులను ముంచింది జగనే

**మంత్రి గొట్టిపాటి రవికుమార్**



- ఆక్వా రైతులకు సబ్సిడీ పునరుద్ధరణ
- జగన్ హయాంలోనే జోన్ల విభజన
- యూనిట్ విద్యుత్ రూ.1.50కే సరఫరా
- రైతుల సంక్షేమానికి కూటమి కట్టుబాటు
- రాజకీయ స్వలాభం కోసమే జగన్ యాత్రలు


2లో

# సంపాదకీయం

## సమానత్వమే జగన్నాథుని మంత్రం

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై









ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజన గీతాలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహాప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్న అనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహాప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహాప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. "అంతటా ఉండే ఓ మహాప్రభూ... నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను... నా పూర్ణ హృదయంతో..." అని ఆ పాటకి అర్థం.

లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథుని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహాప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనేవారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన 'ఆహే నీల శైల' అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. "పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహాప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే.. ఎప్పటికీ మరచిపోం" అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహా ప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే 'బడ దేవుళ' లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం- పూరీ చాలా దూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాల యూనిట్--2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండేదాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నా మదిలో స్పష్టంగా ఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా?

ఎవరైనా మహాప్రభు జగన్నాథుని రథయాత్రను మరచిపోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనం కోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తులకు దర్శనమిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై.. చక్రరాజ సుదర్శనునితో పాటు.. ముగ్గురు దేవతామూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడు రోజులు ఉండి, ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి లేదు.

చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖదుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా.

భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహాప్రభుని తలచుకున్నాను. 'నన్ను ఇంత పెద్ద స్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు' అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హౌజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీ జగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహాప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురిపించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జూలై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ... దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరిస్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది.

అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అనిపించింది. 'మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి' అని మౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబర్ 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడ దాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడ దాండ శ్రీ జగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టాను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీల చక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను.

ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరువైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభుమీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి... ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే.

## హర్మూజ్ దాటే నౌకల్లో భారతీయుల్ని నియమించుకోవద్దు: కేంద్రం కీలక అడ్వైజరీ

మొదటిపేజీ తరువాయి

నేవిగేషన్ హెచ్చరికలు, భద్రతాపరమైన సూచనలను ఎప్పటికప్పుడు గమనించుకోవాలని షిప్పింగ్ కంపెనీలకు భారత్ సూచించింది. నౌకాయానానికి సంబంధించిన అంతర్జాతీయ నియమావళిని కచ్చితంగా పాటించాలని చెప్పింది. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన వివరాలను షేర్ చేసింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతోన్న పరిస్థితులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని వెల్లడించింది.

**ఖర్గ్ ద్వీపం సీజ్.. పికాక్స్ పర్వత కాంప్లెక్స్ ధ్వంసం: అమెరికా లక్ష్యాలివే..!**

ఇటీవల యూఏఈ జెండాతో ఉన్న రెండు నౌకలపై ఇరాన్ (×తీఖఅ) దాడి చేయడంతో భారత సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ రెండు నౌకలు నేవిగేషన్ హెచ్చరికలను విస్మరించినట్లు తెలుస్తోంది. ఒమన్ తీరంలో వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై జరిగిన దాడిలో భారత మెరైన్ ఇంజినీర్ హేరంభ్ కర్మర్కర్ గల్లంతయ్యారు. అతడిని కాపాడేందుకు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. అతడు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇవేకాకుండా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచి పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు.

## నీట్ (యూజీ) రీ-టెస్ట్ ఫలితాలు విడుదల..

మొదటిపేజీ తరువాయి

ఈ జాబితాలో తెలంగాణ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.

మొత్తం 720 మార్కులకు గాను 19మంది విద్యార్థులు 700కు పైగామార్కులు సాధించారు. వీరిలో ఆర్యన్ గుప్తా (పంజాబ్), పస్నుల్ బన్సల్ (హరియాణా) సంయుక్తంగా 715 మార్కులు సాధించి అదరగొట్టారు. 1492మందికి 650 కన్నా అధిక మార్కులు రాగా.. 10,160మందికి 600 మార్కులు ఆ పైన, 90,780మందికి 500 ఆపైన మార్కులు వచ్చాయి.

కేటగిరీల వారీగా పరిశీలిస్తే.. జనరల్ కేటగిరీలో 2.91లక్షల మంది క్వాలిఫై కాగా.. ఓబీసీ ఎన్‌సీఎల్‌లో 5.12లక్షలు, ఎస్సీ 1.59లక్షల మంది, ఎస్టీ 63,716మంది, జనరల్ ఈడబ్ల్యూఎస్ 95,026, పీడబ్ల్యూబీడీ 3666, పీడబ్ల్యూడీ 303మంది క్వాలిఫై అయ్యారు.

వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం తొలుత నీట్ (యూజీ) పరీక్షను మే 3న నిర్వహించగా.. ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో జూన్ 21న మరోసారి దేశ వ్యాప్తంగా రీ-ఎగ్జామ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు దాదాపు 20లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జులై 13న ఓంఎఆర్ షీట్లు విడుదల చేసి బుధవారం వరకు (జులై 15)అభ్యంతరాలు స్వీకరించిన ఎన్‌టీఏ అధికారులు నేడు ఫైనల్ కీని వెబ్‌సైట్‌లో ఉంచిన గంటల వ్యవధిలోనే ఫలితాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

## ఆక్వా రైతులను ముంచింది జగనే

మొదటిపేజీ తరువాయి

**అమరావతి, జూలై 16 (సదా మీకోసం):**

ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి తెలిపారు. జగన్ తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

**విద్యుత్ రాయితీల పునరుద్ధరణ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీలు అందిస్తోందని వివరించారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలు**

వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

**కూటమి ప్రభుత్వ లక్ష్యం**

జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

## గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ క్షమాపణ చెప్తోంది: మంత్రి నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

"గడిచిన నాలుగు దశాబ్దాలుగా అమరరాజా కేవలం ఆంధ్రప్రదేశ్ సాధించిన అతిపెద్ద పారిశ్రామిక విజయాల్లో ఒకటిగానే కాకుండా అంతకుమించి నిలిచింది. ఈ సంస్థ ప్రపంచస్థాయి ఉత్పాదకతను సృష్టించి వేలాది మందికి ఉద్యోగాలు అందించింది. చిత్తూరుతో పాటు ఆంధ్రప్రదేశ్ పేరును భారతదేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పింది. గత ప్రభుత్వం ఈ సంస్థను వేధింపులకు గురి చేయకుండా ఉండాల్సింది. సొంత రాష్ట్రంలోనే పరిశ్రమను స్థాపించి, వృద్ధి చేయాలని భావించిన ఒక పారిశ్రామికవేత్తకు ఉండాల్సింది ప్రోత్సాహం కానీ.. బెదిరింపులు కాదు.

ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన సంస్థ తన తదుపరి వృద్ధి ప్రయాణం కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి వేరే చోటికి వెళ్లాల్సి రావడం ఎంతగానో కలచివేసింది. తిరిగి నమ్మకాన్ని పునర్నిర్మిస్తున్న తరుణంలో ఏపీ పారిశ్రామిక రంగం అమరరాజాకు మళ్లీ స్వాగతం పలుకుతోంది. ఆ సంస్థ తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాష్ట్రంలోనే.. భవిష్యత్తులోనూ అతిపెద్ద సువర్ణాధ్యాయాలు లిఖించబడతాయి. అమరరాజా కోసం ఏపీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి" అని లోకేశ్ పేర్కొన్నారు.

## గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## జగన్నాథ రథయాత్రలో అపశృతి

మొదటిపేజీ తరువాయి

**తొక్కిసలాటలో ఊపిరిడక ఒకరు మృతి**

**వందమందకి పైగా భక్తులకు గాయాలు**

ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

## పీపీపీతోనే వేగవంతమైన అభివృద్ధి

**కేంద్రం నిధులు, ప్రశంసలు**

విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని, ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు.

**స్వర్ణాంధ్ర లక్ష్యాలు**

2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని, సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు.

**ఆస్తుల సద్వినియోగం**

ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు.

**రెసిడెన్షియల్ పాఠశాలల బలోపేతం**

పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

**నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత**

బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

## 9వ తరగతిలో మూడో భాష వద్దు: సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో భాగంగా మూడో భాష అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తొమ్మిదో తరగతిలో కొత్త భాషను ప్రవేశపెట్టడం సరికాదని పేర్కొంది. దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. దీనికి బదులు.. ఏదైనా కొత్త భాషను ఐదు లేదా ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల (జీఎీఎ) ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ (సీబీఎస్ఈ అంశంపై కాకుండా)ను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం త్రిభాషా విధానంపై ఈ విధంగా వ్యాఖ్యానించింది.

ఆయనను కాపాడేందుకు ఏదైనా చేయండి.. వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై హైకోర్టు

దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో (జీఎీఎ) త్రిభాషా విధానం అమలు అవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం.. వీటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జేఎన్‌వీ ఏర్పాటును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వగా.. దీనిని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, సీబీఎస్ఈలో త్రిభాషా విధానంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ప్రత్యేకంగా విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం: రామ్మోహన్ నాయుడు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు పూర్తయ్యాయని, ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని కోరినట్టు చెప్పారు. తేదీ ఖరారైన వెంటనే.. నెల రోజుల్లో విమాన కార్యకలాపాలు ప్రారంభిస్తామని తెలిపారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఇటీవల కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది. 'ఇమిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025' పరిధిలోకి ఈ ఎయిర్‌పోర్టును చేర్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానంలోకి చేరింది. కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఈ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఈ నోటిఫికేషన్‌తో ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు గుర్తింపు పొందింది.

# యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 16

ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పురోగతి, వన మహోత్సవంపై గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు చేసిన గృహాలు, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న వివరాలతో పాటు, పూర్తయిన ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ లు కలెక్టర్ కు తెలిపారు.ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు.దశల వారీగా ప్రగతిలో ఉన్న ఇండ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణాల మంజూరు ప్రక్రియలో అధికారులు అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండవ దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని అన్నారు.

### మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మొక్కలు నాటేందుకు సరిపడా సిద్ధంగా ఉంచాలని, గుంతలు తీసి పెట్టాలని సూచించారు.టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా

**– రుద్రంగి సబ్‌స్టేషన్‌లో నూతన 8 వీఎూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన విప్**

రుద్రంగి మండలం/ ప్రజాదివాస్ జూలై 16

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8 వీఎూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు...ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రుద్రంగి ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న లో–వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసి 5 వీఎూ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో 8 వీఎూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు.వేములవాడ నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాల కాలంలోనే 13 నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయించడం ఒక రికార్డు అని తెలిపారు. రుద్రంగి, నూకలమర్రి, ఎనిగ్గల్, లింగంపేట, మరిమడ్ల, పోసానిపేట, సిరికొండ, భీమారం, కాచారం, పోరుమల్ల తదితర ప్రాంతాల్లో 33/11 ఖ౦ సబ్‌స్టేషన్లు మంజూరు చేయడం లేదా నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. కత్లాపూర్‌లో రూ. కోట్ల వ్యయంతో 220 ఖ౦ భారీ సబ్‌స్టేషన్ నిర్మాణం కొనసాగుతోందని వెల్లడించారు.రైతులకు





విద్యుత్ కనెక్షన్ల కోసం గతంలో భారీ మొత్తాలు ఖర్చు చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై భారం తగ్గిస్తూ కిలోమీటర్ వరకు విద్యుత్ లైన్, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.రైతులకు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి, రైతాంగ సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.అధికారులు మాట్లాడుతూ, రుద్రంగి సబ్‌స్టేషన్‌లో గతంలో 5 వీఎూ మరియు 8 వీఎూ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండేవని, పెరుగుతున్న విద్యుత్ వినియోగం కారణంగా లో–వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో అదనంగా మరో 8 వీఎూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం రెండు 8 వీఎూ ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం అయిందన్నారు.. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా మరో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగించవచ్చని వెల్లడించారు.అదేవిధంగా రుద్రంగి ప్రాంతానికి 132 ఖ౦ సబ్‌స్టేషన్ మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని, లింగంపేట, నర్సింగాపూర్ తదితర ప్రాంతాల్లో 33/11 ఖ౦ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,800కు పైగా మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయడం, రైతులకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు వేగంగా అందించడం జరిగిందన్నారు. గత ఏడాదిలోనే 1,300 మంది కొత్త రైతులకు విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వివరించారు.

# ఎల్‌నినో ముప్పు: ప్రత్యామ్నాయ పంటలే రైతుకు శ్రీరామరక్ష..

**– కోనరావుపేట ఇంచార్జ్ వ్యవసాయ అధికారి దుర్గరాజు...**

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 16

భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత తరుణంలో ఎల్‌నినో ప్రభావం తోడై రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో నీటి లభ్యత నానాటికీ క్షీణించే ప్రమాదం ఉన్నందున, రైతులు సాంప్రదాయ వరి సాగుపైనే పూర్తిగా ఆధారపడకుండా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోనరావుపేట మండల ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు సూచించారు. ప్రస్తుతం మండల పరిధిలోని బోరుబావుల్లో నీటిమట్టాలు రోజురోజుకూ పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో చెరువులు కూడా పూర్తి స్థాయిలో నిండే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. ఒకవేళ చివరి దశలో అరకొర వర్షాలు కురిసినా జలాశయాలు నిండటం కష్టమేనని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులు తమకున్న భూమిలో మొత్తం వరి సాగు చేస్తే, పంట చివరి దశకు వచ్చేసరికి నీరందక చేతికొచ్చిన పంట ఎండిపోయి కోలుకోలేని నష్టాలు వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు...రైతు సోదరులు నష్టాల బారి నుంచి గట్టెక్కడానికి తక్కువ నీటితో పండే మేలైన ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని దుర్గరాజు కోరారు. ముఖ్యంగా జొన్న వంటి తృణధాన్యాలు, పెసలు, మినుములు, కంది వంటి పప్పుధాన్యాలతో పాటు పొద్దుతిరుగుడు, ఆముదం వంటి నూనెగింజల పంటలను సాగు చేయడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ ప్రత్యామ్నాయ పంటల



వల్ల నీటి పొదుపుతో పాటు పెట్టుబడి భారం కూడా తగ్గుతుందని వివరించారు. కాబట్టి కోనరావుపేట మండల రైతులంతా ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ సాగు దిశను మార్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజలింగంపేటలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**– గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ ఉత్సవాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**



భీమారం మండలం/ ప్రజాదివాస్ జూలై 16

జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని భీమారం మండలం రాజలింగంపేట గ్రామంలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. గిరిజన సమాజం అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.తీజ్ పండుగ గిరిజనుల సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇటువంటి పండుగలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సంచార జాతుల ఓట్లను తొలగించాలని ఎమ్మార్వో కు వినతి పత్రం

ముస్తాబాద్/ జులై 16 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మోహినికుంట గ్రామంలో నివసిస్తున్న సంచార జాతుల పేర్లను నేడు జరుగుతున్న సర్ కార్యక్రమంలో తొలగించాలని కోరుతూ మోహిని కుంట గ్రామ ప్రజలు గురువారం మెరుగు యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పేరిట వచ్చే సంక్షేమ పథకాలు గ్రామస్తులకు అందకుండా సంచార జాతుల వారికి అందుతున్నాయని దీనితో గ్రామంలో ఉన్న ప్రజలు నష్టపోవడం జరుగుతుందని కొంతమంది నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం సంచారజాతుల ప్రజలను గ్రామంలో తీసుకొచ్చి నివాస స్థలాలు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు గ్రామానికి ఏ పథకాలు వచ్చిన అర్హులైన గ్రామస్తులకు అందడం లేదని ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి 2002 ఓటరు జాబితా ప్రకారం సంచార జాతుల వారికి ఎక్కడైతే ఓటు హక్కును కలిగి ఉన్నారో అక్కడే ఓటు హక్కు వచ్చే విధంగా ఇక్కడ జరుగుతున్న సర్ ప్రక్రియలో సంచార జాతుల ప్రజల ఓట్లలో తొలగించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మెరుగు యాదగిరి గౌడ్ పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# కరెంటు లేక పంటలు ఎండుతున్నాయి.. రోడ్డెక్కిన కోనరావుపేట రైతాంగం

**– నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలంటూ నిజామాబాద్, కనగర్తి రైతుల ఆందోళన**

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 16






నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, కనగర్తి గ్రామాల రైతులు గురువారం ప్రధాన రహదారిపై బైఠాయించారు. కరెంటు లేక వరి నాట్ల సమయంలో పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, కరెంటు కష్టాలతో పాటు మార్కెట్‌లో ఎరువులు కూడా సకాలంలో దొరకడం లేదని మండిపడ్డారు. రైతుల ఆకస్మిక ధర్నాతో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా, ఉన్నతాధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడు మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు

**- చందుర్తి మండలం ఏనగల్ గ్రామ శివారులో విషాదం.. ఇంటర్మీడియట్ విద్యార్థి అక్కడికక్కడే మృతి**

చందుర్తి మండలం /ప్రజాదివాస్ జూలై 16



చందుర్తి మండలం ఏనగల్ గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.చందుర్తి ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం, కోనరావుపేట మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన వడ్నాల రాజు (17), చందుర్తి మండలం జలపతి తాండాకు చెందిన భూక్య ఆకాష్ వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ బైక్‌పై బాబుసాయిపేటలోని రాజు అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది.మార్గమధ్యలో ఏనగల్ గ్రామ శివారులో సిరికొండ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన కారు వేములవాడ వైపు వస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడ్నాల రాజు అక్కడికక్కడే మృతి చెందగా, భూక్య ఆకాష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.మృతుడి తల్లి వడ్నాల రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

# రాజన్న కళ్యాణకట్టలో ఈవో రమాదేవి ఆకస్మిక తనిఖీ

**- అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 16



శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కింది కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు, భక్తుల ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె ముందస్తు సమాచారం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విధుల్లో ఉన్న నాయి బ్రాహ్మణులను వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వివరాలు సేకరించారు.కళ్యాణకట్టలో పనిచేసే సిబ్బందికి యూనిఫాం, ఐడీ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేస్తే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. భక్తుల అవగాహన కోసం టికెట్ ధర రూ.50 మాత్రమేనని, అదనపు డబ్బులు ఇవ్వద్దని తెలిపే బోర్డులను ప్రదర్శింపజేశారు. నగదు వసూళ్లపై నిఘా ఉంచేందుకు ఇద్దరు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రాంగణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఫుటేజీ ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఆలయ డీఈవో నవీన్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

# నామాపురంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ముస్తాబాద్ /జూలై 16 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపురం గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద గల వాటర్ ప్లాంట్ మెతుకు సత్యం రెడ్డి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ గ్రామ సర్పంచ్ అనిల్ సత్యం రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల త్రాగునీటి కొరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు ఆర్థిక సహాయం అందించిన సందర్భంగా గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

# రోడ్డు ప్రమాదాల నియంత్రణయే లక్ష్యంగా ప్రమాదాలు జరుగు(బ్లాక్ స్పాట్స్) ప్రదేశాలు సందర్శన.

**- రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు, ప్రజలు భాగస్వామ్యం కావాలి.**

బోయినపల్లి మండలం /ప్రజాదివాస్ జూలై 16



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గురువారం రోజున బోయినపల్లి మండలం కోదురుపాక చౌరస్తాలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బోయినపల్లి ఎస్ఐ లతో కలిసిపరిశీలించారు.ఈసందర్భంగా ప్రమాదాలకు దారితీసే కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాలనుసమర్థవంతంగా అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, స్ట్రీట్ లైటింగ్ కల్పించడం,రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ , రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తూ అతివేగం , నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించి సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మిడ్ మానేర్ డ్యామ్‌ను సందర్శించి, సంబంధిత ఇంజనీర్లతో డ్యామ్ భద్రత మరియు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి.

**- జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి సైబర్ వారియర్ పనిచేయాలి.**

రాజన్న సిరిసిల్ల జిల్లా /ప్రజాదివాస్ జూలై 16



జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో నియమించబడిన సైబర్ వారియర్స్ సమర్థవంతంగా పనిచేయాలని అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు.జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు.

**ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.....**

సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించబడ్డ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై వచ్చే పిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్లలో ఒక సైబర్ వారియర్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రజలు సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్ కి కానీ, చీజ్రా జూశేత్శుశ్రీ నందు కానీ, పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని సంప్రదించాలన్నారు.
ప్రతి సైబర్ వారియర్ తన పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో సైబర్ ఆర్.ఎస్.ఐ జునైద్, సైబర్ వారియర్లు పాల్గొన్నారు.

# బద్దెనపల్లిలో గేదెల దొంగల ముఠా గుట్టురట్టు!

**- ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ. 1.30 లక్షలు స్వాధీనం..**

తంగళ్లపల్లి మండలం /ప్రజాదివాస్ జూలై 16

సరిహద్దులు దాటి వచ్చి పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టును తంగళ్ళపల్లి పోలీసులు రట్టు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను గుర్తించిన పోలీసులు.. ఆంధ్రప్రదేశ్‌లో వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిరిసిల్ల సర్కిల్ సీఐ కే. నాగేశ్వర రావు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం...తంగళ్ళపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆరేటి పోచయ్యకు చెందిన రెండు గేదెలు, అదే గ్రామానికి చెందిన ఆరేటి వెంకటేష్‌కు చెందిన ఒక గేదె ఈ ఏడాది మే 23న రాత్రి వేళల్లో దొంగతనానికి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
ఆధునిక సాంకేతికతను జోడించి దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసు బృందం..నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వీర్ల వెంకటరావు, చిత్తూరీ గంగాధర్, వీర్ల మల్లికార్జున రావుగా గుర్తించారు.నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లింది. అక్కడ నిఘా ఉంచి ముగ్గురు నిందితులలో వీర్ల వెంకటరావు, చిత్తూరీ గంగాధర్‌లను అదుపులోకి తీసుకోగా, వీర్ల మల్లికార్జున రావు తప్పించుకున్నాడు. నిందితులను విచారించగా వారు నేరాన్ని





అంగీకరించారని, వారి వద్ద నుండి రూ. 1,30,000 నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. క్లిష్టమైన ఈ దొంగతనం కేసును చాకచక్యంగా ఛేదించిన తంగళ్లపల్లి ఎస్ఐ ఉపేంద్ర చారి, ఎస్ఐ-×× మల్లేశం, పోలీస్ సిబ్బంది సంపత్ కుమార్, శ్రీనివాస్‌లను సీఐ నాగేశ్వర రావు ప్రత్యేకంగా అభినందించారు.

# అనారోగ్యం భరించలేకే వేములవాడలోని సాయి నగర్ కు చెందిన యువకుడి ఆత్మహత్య

**- ఆస్తమా, ఛాతీ నొప్పితో మనస్తాపం.. ఇంట్లో ఉరివేసుకున్న హేమంత్ (అజయ్)**
**- 18 రోజుల క్రితమే బాబు జననం.. అంతలోనే అనారోగ్యంతో తండ్రి బలవన్మరణం**
**- పత్రిక ప్రకటనలో వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ వీర ప్రసాద్**

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 16



వేములవాడ పట్టణ పరిధిలోని సాయినగర్‌లో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన బాలసాని హేమంత్ (అజయ్) (24) గత నాలుగేళ్లుగా ఆస్తమా, తీవ్రమైన ఛాతీ నొప్పితో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన హేమంత్, బుధవారం రాత్రి 9:20 గంటల సమయంలో తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చూసేలోపే అతడు మృతి చెందాడు. మృతునికి 18 రోజుల క్రితమే బాబు జన్మించడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.ఘటనపై మృతుడి తండ్రి బాలసాని మల్లేశం గౌడ్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ సీఐ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిళ్లతో బాధపడేవారు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని, కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా వైద్య నిపుణులను సంప్రదించి సకాలంలో సహాయం పొందడం ద్వారా ఇలాంటి విషాదాలను నివారించవచ్చని సూచించారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఆర్. కృష్ణయ్య చేపట్టే దీక్షకు మద్దతుగా నిలుస్తాం.. బేరి రామచందర్ యాదవ్

ప్రజాదివాస్
ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష ద్వారా విద్యార్థులకు ఫీజు బకాయిలు, స్కాలర్షిప్లు, ఉద్యోగాలు, తక్షణమే అందజేయాలని చేపడుతున్న దీక్షకు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తామని తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ డిమాండ్ పేర్కొన్నారు. బేరి రామచందర్ యాదవ్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాల విద్యార్థులకు అండగా నిలిచి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలి చెల్లించాల్సిన ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్తుల దృష్టిలో ఉంచుకొని ఫీజులు, స్కాలర్షిప్లు, ఉద్యోగాలు, తక్షణమే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల కోసం ఆర్ కృష్ణయ్య చేపట్టే ఇలాంటి దీక్ష కైనా తాము అండగా నిలుస్తామని తెలిపారు. హైదరాబాదులోని ధర్నా చౌక్ వద్ద ఆర్ కృష్ణయ్య చేపట్టిన దీక్షకు అనూహ్య స్పందన లభించిందన్నారు. విద్యార్థుల కోసం చేస్తున్న దీక్షకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు అనంతరం ఆర్ కృష్ణయ్య కలిసి ఆయన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భేరి రామచందర్ యాదవ్ తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్ కె.సాయన్న ముదిరాజ్ మరియు తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మరియు మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం , మరియు తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మరియు బిసి ఫెడరేషన్ ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్ , గండి మైసమ్మ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ , పులి రాజేందర్ , నోముల ప్రవీణ్ కుమార్ , బీసీ నాయకులు అన్నా నగర్ అధ్యక్షులు శ్రీశైలం గౌడ్ , ఉప్పల్ అధ్యక్షులు ఎంవిఎస్ నాయక్ , కీర్తి కుమార్ , కుల్బారం అధ్యక్షులు మురళీధర్ , గజ్వేల్ అధ్యక్షులు ఇస్మాయిల్



, యువజన అధ్యక్షులు కొంటు సుమన్ , సిద్ధార్ధ ముదిరాజ్ , శీను పటేల్ , అనేకమంది బీసీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో బేరితో పాటు మద్దతుగా నిలిచి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే జారే

ప్రజాదివాస్
ఉమ్మడి జిల్లా పరిధిలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పనులపై అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... గోదావరి జలాలను గ్రావిటీ, లిఫ్ట్ విధానాల ద్వారా గరిష్టంగా వినియోగంలోకి తీసుకువచ్చి చివరి ఆయకట్టు వరకు



సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీతారామ ప్రాజెక్టును సమగ్రంగా సమీక్షించి, ఇప్పటికే జరిగిన పనులు వృథా కాకుండా అవసరమైన సాంకేతిక మార్పులతో వేగంగా పూర్తి చేసే దిశగా నిరంతర కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రజల పన్నుల రూపంలో వచ్చే ప్రతి పైసా ప్రజా ధనాన్ని జాగ్రత్తగా వినియోగిస్తూ, ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, లింక్ కెనాల్స్, టన్నెల్స్ నిర్మాణంతో వైరా, పాలేరు రిజర్వాయర్లను అనుసంధానిస్తూ సత్తుపల్లి వరకు సాగునీరు అందేలా పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు నెలవారీ కార్యాచరణ ప్రణాళికతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం

- అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..
- రైతు సహకార సంఘాలను మోసం చేసింది..
- రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రాలుగా మార్చే కుట్ర చేస్తోంది..
- కౌకుంట్ల చంద్రారెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి



ప్రజాదివాస్
అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పీఏసీఎస్ లలో పదవులను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తున్న అంశంపై నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి,బీజేపీ పంచాయతీ రాజ్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కీసర డివిజన్ అధ్యక్షుడు బాలరాజు యాదవ్ లు ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులకు తక్కువ వడ్డీపై పంట రుణాలు అందించడం, పంటల కొనుగోలు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరా, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే ఈ సంఘాలు రైతు ప్రయోజనాల పరిరక్షణకు ప్రతీకలని, అలాంటి సంస్థలను కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయ కేంద్రాలుగా మార్చాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంపూర్ణ రుణమాఫీ హామీ నేటికీ అమలు కాలేదని, రైతు భరోసా పథకాన్ని పలుమార్లు వాయిదా వేసిందని, పంటలకు బోనస్ విషయంలో కూడా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులకు పదవులు కట్టబెట్టడంలో మాత్రం అసాధారణ వేగం ప్రదర్శించడం ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయని అన్నారు. రైతు సహకార సంఘాల నియామకాల అంశంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పెండింగ్లో ఉన్నప్పటికీ,న్యాయ ప్రక్రియను సైతం పక్కనబెట్టి తొందరపాటుగా ముందుకు సాగడం ప్రభుత్వ అసలు ఉద్దేశాన్ని బయటపెడుతోందన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు, సొంత వర్గాల రాజకీయ పునరావాసమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. రైతుల ఆత్మగౌరవాన్ని, సహకార సంఘాల స్వతంత్రతను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ భారతీయ జనతా పార్టీ సహించదని, రైతుల పక్షాన అన్ని స్థాయిల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# రమణమూర్తిపై దాడి చేసిన కాశపు రెడ్డి పై తక్షణమే అరెస్టు చేయాలి

- ఆర్ఎస్ఎస్ నాయకుడు కాశపు రెడ్డి పై చర్యలు తీసుకోవాలని సిపిఐ, ప్రజాసంఘాల డిమాండ్..

ప్రజాదివాస్
బీఆర్యేఎస్ న్యూస్ ఛానల్ లైవ్ డిబేట్లో పాల్గొన్న రమణమూర్తిపై ఆర్ఎస్ఎస్ నాయకుడు కాశపురెడ్డి చేసిన దాడిని సిపిఐ పార్టీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు. ఈ దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ప్రగతి నగర్లోని నీలం రామచంద్రయ్య భవన్ వద్ద సిపిఐ పార్టీ,వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఒక నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఛానల్ లైవ్ ప్రసారంలో ఉండగానే భౌతిక దాడికి తెగబడటం కాశపు రెడ్డి అహంకారానికి, ఉన్మాదానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. బాధ్యుడిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసన ఖండన కార్యక్రమంలో పలు పార్టీల, కార్మిక, మహిళా సంఘాల ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




తోటపల్లి శంకర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ షావలి ఐఎఫ్టీయూ జాతీయ నాయకులు శివ బాబు ఏఐఎఫ్ టు యు చంద్రమౌళి పిడిఎమ్, సదానందం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,ప్రవీణ్ ఐఎఫ్టీయూ, నరసింహా గౌడ్ మాజీ ఉపసర్పంచ్,జయక్కచైతన్య మహిళా సమాఖ్య, మేక లలిత యాదవ్ మాజీ కార్పొరేటర్, లక్ష్మీబాయి పీఓడబ్ల్యూ -స్వరూప న్యూ డెమోక్రసీ వీరితో పాటు బహుజన సత్తానాయకులు సింగరయ్య గౌడు ఏఐఎఫ్టీయూ నాయకులు మల్లేష్ ఆలూరి సావిత్రి, జయసుధ, పెరికే సునీత, మబ్బు బాలు ఏఐ టియుసి నాయకులు అంబాల ఎల్లయ్య తదితర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని రమణమూర్తికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఇకపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారు హెచ్చరించారు.

# గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కుసునూరుపల్లి మండల కాంగ్రెస్

ప్రజాదివాస్
మల్కాజిగిరి, మెదక్ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాల్సింది పోయి మాజీ మంత్రి మైనంపల్లి హన్మంతరావు అనుచరులతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయించడాన్ని సిద్దిపేట జిల్లా కుసునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందూరి ఐలయ్య తీవ్రంగా ఖండించారు.కుసునూరుపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడైన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని ఓర్వలేక మైనంపల్లి హన్మంతరావు తన అనుచరులతో ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. సొంత నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయడం మాని, పక్క నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.తన అనుచరులు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి నర్సారెడ్డిని ఉద్దేశించి మైనంపల్లి గాని, ఆయన అనుచరులు గాని మాట్లాడినట్లయితే గజ్వేల్ నియోజకవర్గంలోకి అడుగు పెట్టనివ్వమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాచం నవీన్, తిప్పరం కృష్ణారెడ్డి, చిన్నకృష్ణపురం సంతోష్ రెడ్డి, జయపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, బొబ్బాయిపల్లి నవీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 16



వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వానల్లేని కాలం.. ఎండిపోతున్న నారుమడులు!

- రైతన్నల కళ్లల్లో కన్నీరు.. వరుణుడి కరుణ కోసం కొండాపూర్ ఎదురుచూపులు...




కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 16
కాలం కాని కాలంలో కారుమబ్బులైనా కరుణించకపోతాయా అని ఆశపడ్డ రైతన్నకు ఆకాశమే పగబట్టినట్లయింది. చేతికందిన కాడిని పట్టి, నమ్మకంతో నాట్లు వేసిన కర్షకుడికి ఇప్పుడు వానల్లేని వైనం గుండెకోత మిగులుస్తోంది..
కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో ప్రస్తుత సాగు ముఖచిత్రం అత్యంత ఆందోళనకరంగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న ఆశతో అన్నదాతలు వరి నాట్లు వేశారు. వేలకు వేలు అప్పులు తెచ్చి, రేయింబవళ్లు శ్రమించి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. తీరా నాట్లు వేసి పంటను సాకుదామనుకునే సమయానికి ఆకాశానికి చిల్లు పడినట్లు ఒక్క చుక్క రాలకపోవడంతో పరిస్థితి తలకిందులైంది. పచ్చగా కళకళలాడాల్సిన నారుమడులు నిలువునా ఎండిపోతున్నాయి. కళ్లముందే పంట వాడిపోతుంటే, ఏం చేయాలో పాలుపోక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పాతాళ గంగ సైతం అడుగంటడంతో ప్రత్యామ్నాయ నీటి వనరులు లేక, ఆకాశం వైపు దీనంగా మొహం పెట్టి చూస్తున్నారు. సకాలంలో వానలు కురవకపోతే ఈ ఏడాది పెట్టుబడులు కూడా దక్కవని, అప్పుల ఊబిలో కూరుకుపోతామని లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించి, కాస్తయినా కనువిప్పు కలిగిస్తేనే తమ పంటలు బతుకుతాయని, తక్షణమే వర్షాలు కురిసి అన్నదాతను ఆదుకోవాలని కొండాపూర్ రైతాంగం వేడుకుంటోంది. ప్రభుత్వం కూడా స్పందించి తగిన నీటి వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రకృతి, ఆరోగ్యం, విద్యపై అవగాహన కార్యక్రమం 5 కంప్యూటర్ల బహుకరణ



ప్రజాదివాస్
సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రకృతి, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శంకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రకృతివనం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రకృతి ఆధారిత జీవన విధానం, ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు 5 కంప్యూటర్లను బహుకరించడంతో పాటు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కంప్యూటర్లు విద్యార్థుల డిజిటల్ విద్యాభివృద్ధికి దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. అనంతరం విద్యార్థులు సంగారెడ్డిలోని సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, మండల విద్యాధికారి (ఎంఈఓ) శంకర్, జిల్లా సైన్స్ అధికారి (డీఎస్ఓ) పి. సిద్ధారెడ్డి, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మాధవ రెడ్డి, ప్రకృతివనం డైరెక్టర్ లవకుశ, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, ప్రకృతి ప్రేమికుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందాన్ని అతిథులు అభినందించారు.

## శామీర్ పేటలో సర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



ప్రజాదివాస్
ప్రత్యేక సమగ్ర సవరణ సర్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బిఎల్ఓ లకు సూచించారు. గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్ పేట గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బి ఎల్ వో లకు మొత్తం ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు కేటాయించారు. ఇప్పటి వరకు ఎన్ని ఫారాలు అందించారు, తిరిగి ఎన్ని ఫారాలు తీసుకున్నారని బిఎల్ ఓలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న ఫారాల డిజిటలైజ్ ఏవిధంగా చేస్తున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవసరమైన మేర సహాయం అందించాలని బిఎల్ఓలకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసీల్దారు సిహెచ్.శ్రీనివాస్, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బిఎల్ ఓ లు ఓటర్లకు సహకరించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ప్రజాదివాస్
ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియలో భాగంగా పూరించిన ఫారాలను తీసుకోవడం, డిజిటలైజ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడం బిఎల్ఓల బాధ్యతని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.




గురువారం బోయిన్పల్లి ఫతేనగర్ లలో నిర్వహిస్తున్న (ఎస్ఐఆర్) సర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని, స్వీకరించిన ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బి ఎల్ వో లదేనని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బి ఎల్ వో లు ఓటర్లకు సహకరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐదు ప్రధాన దేవాలయాల్లో దివ్య వ్యర్థాల సేకరణ ప్రత్యేక కార్యక్రమం

ప్రజాదివాస్
పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో 2026 జూలై 18 (శనివారం) ఉదయం 8:30 గంటల నుంచి 11:00 గంటల వరకు కార్పొరేషన్ పరిధిలోని ఐదు ప్రధాన దేవాలయాల్లో "దివ్య వ్యర్థాల సేకరణ కార్యక్రమం " నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది మరియు స్వచ్ఛంద సేవకులు సంయుక్తంగా నిర్వహించనున్నారు. దేవాలయాల్లో ఉత్పత్తి అయ్యే పూలు, ఆకులు, కొబ్బరి చిప్పలు, ఇతర పూజా సామగ్రి వంటి దివ్య వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించడం, వేరు చేయడం, పునర్వినియోగం చేయడం మరియు పర్యావరణ హిత విధానాల్లో నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

**ఈ కార్యక్రమం క్రింది దేవాలయాల్లో నిర్వహించబడుతుంది:**





- సీతా రామాంజనేయ స్వామి దేవాలయం, వైట్‌ఫీల్డ్స్, కొండాపూర్ (మాధాపూర్ సర్కిల్)
- శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, సెవెన్ హిల్స్ రోడ్, నిజాంపేట్ (ఆల్విన్ కాలనీ సర్కిల్)
- శివాలయం, కొంపల్లి సర్కిల్
- సాయి బాబా దేవాలయం, పీకాక్ జంక్షన్ సమీపంలో, ప్రగతి నగర్ (నిజాంపేట్ సర్కిల్)
- శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, రైల్వే అండర్‌పాస్ సమీపంలో, మెడ్చల్ (మెడ్చల్ సర్కిల్)

కార్యక్రమంలో సేకరించిన దివ్య వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి, అధీకృత రీసైక్లింగ్ సంస్థల ద్వారా పర్యావరణానికి అనుకూలంగా ప్రాసెస్ చేయడం జరుగుతుంది. దీని ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, పూజా వ్యర్థాల సుస్థిర నిర్వహణకు ప్రోత్సాహం లభిస్తుంది. ఈ సందర్భంగా దేవాలయ నిర్వహణ కమిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు , స్వచ్ఛంద సేవకులు, భక్తులు మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పరిశుభ్రమైన, హరితమయమైన మరియు పర్యావరణ హితమైన సైబరాబాద్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# సంగారెడ్డి లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన జగ్గారెడ్డి

- సంగారెడ్డి పట్టణం లో ఇస్కాన్ ఆధ్వర్యం లో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి పిఎస్సార్ గార్డెన్ వరకు సాగిన యాత్ర

ప్రజాదివాస్
అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ రథయాత్ర సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పీఎస్ఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. రథయాత్రలో పెద్ద సంఖ్యలో






భక్తులు పాల్గొని హరినామ సంకీర్తనలు, భజనలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్ర పొడవునా ఇస్కాన్ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో పెంపొందిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఆయన భక్తి గీతాలు ఆలపించి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్, సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇస్కాన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి

- ఆర్ అండ్ ఆర్ కాలనీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలి
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య
- మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం

ప్రజాదివాస్
గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయల అమలు చేయాలని, బకాయి లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీవో నెం 60 అమలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా



కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గారికి ప్రతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలో పనిచేస్తున్న ముంపు గ్రామాల కార్మికులకు ఎన్నికలు జరిగి ఆరు నెలలు దాటిన మున్సిపల్ జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయకుండా, గ్రామపంచాయతీ పరిధిలో ఇచ్చినట్టు 9500 ఇస్తూ కార్మికులను మోసం చేయడం జరుగుతుందని అన్నారు డైలీ వేజ్ మరియు ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధి కార్మికులకు బకాయి పడిన మూడు నెలల జీతాలు ఇవ్వాలని కార్మికులందరినీ గ్రూపులు ఏర్పాటు చేసి ఈఎస్ఐ,పీఎఫ్ అమలు చేయాలని గ్లౌజులు యూనిఫామ్ సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, స్వామి నాగరాజు పాల్గొన్నారు.

# నిరుద్యోగులపై లాఠీచార్జీని ఖండించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ప్రజాదివాస్
తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 19 వేల పోలీస్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, "5 వేలు పోస్టులు వద్దు -- 19వేలు పోస్టులు ముద్దు" అనే నినాదంతో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ యువత భారీ మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం నిరుద్యోగులపై లాఠీచార్జీ చేయడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నాలు మానుకుని నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి






సుధీర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, కిరణ్, నిరుద్యోగులను అరెస్టు చేసి నాగోల్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వారికీ సంఘీభావం ప్రకటించి మద్దతు తెలపడం పట్ల నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులతో పాటు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా, వేగవంతంగా భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగుల జేఏసీ నాయకులు ఇంద్రా నాయక్, ఆకాష్, శంకర్, శింబు కుమార్ నాయక్, సింధూ రెడ్డి, రమేష్, చెర్రీ, ప్రవీణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవంలో కౌకుట్ల జీవన్ రెడ్డి

ప్రజాదివాస్
ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని రాంపల్లిలో గురువారం శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవంలో భాగంగా నాగారం కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కౌకుట్ల జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక భక్తులతో కలిసి రథాన్ని కదిలించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం రథయాత్రలో పాల్గొని స్వామివారి నుంచి ఆశీస్సులు పొందారు.



# వేములవాడ రాజన్న ఆలయ కళ్యాణకట్టలో ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఆకస్మిక తనిఖీలు

**– భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కింది కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి గురువారం ఉదయం 6:30 గంటలకు స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో కళ్యాణకట్టలో భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో పాటు, కొంతమంది భక్తులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు.తనిఖీల సందర్భంగా ఈవో కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి వచ్చిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఒక్కొక్కరిని వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వారి పూర్తి వివరాలు సేకరించారు. వారికి వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, కాంట్రాక్టర్ ద్వారా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు.కళ్యాణకట్ట నిర్వహణ కాంట్రాక్టర్‌తో మాట్లాడిన ఈవో, అక్కడ పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా యూనిఫాం (డ్రెస్ కోడ్) మరియు గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు) ఇవ్వాలని ఆదేశించారు.

అలాగే కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారా అనే విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు.భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేయడం, వసూలు చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈవో స్పష్టం చేశారు. ఎవరైనా భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు.భక్తులకు అవగాహన కల్పించేందుకు కళ్యాణకట్ట గోడలపై "తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమే", "నాయి బ్రాహ్మణులకు ఎలాంటి అదనపు డబ్బులు చెల్లించవద్దు", "అదనపు డబ్బులు తీసుకోవడం శిక్షార్హమైన నేరం" అనే సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించే బోర్డులు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా భక్తులకు నిరంతరం అవగాహన కల్పించే విధంగా మైక్ ద్వారా ప్రకటనలు చేయించే ఏర్పాట్లు కూడా చేశారు.ఈ సందర్భంగా కళ్యాణకట్టలోని రెండు విభాగాలను పూర్తిగా పరిశీలించిన ఈవో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కళ్యాణకట్టలో నగదు వసూళ్లపై నిరంతర నిఘా ఉంచేందుకు ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమించి, భక్తుల నుంచి ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అంశాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.అదేవిధంగా కళ్యాణకట్ట ప్రాంగణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీసీ కెమెరా ఫుటేజీ



ఆధారంగా ఫిర్యాదులను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అనంతరం కళ్యాణకట్ట నిర్వహణకు సంబంధించిన అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, దేవస్థానం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఆలయ అధికారులకు ప్రత్యేక డ్యూటీలు, స్పెషల్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించి, కళ్యాణకట్టలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ తనిఖీల అనంతరం దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి, ఏఈ రామకృష్ణారావు, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు ఈవోతో కలిసి కళ్యాణకట్ట నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి పారదర్శకమైన, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని, భక్తుల నుంచి ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేసినట్లయితే వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని ఈవో ఎల్. రమాదేవి కోరారు.

# యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**– క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పనుల్లో వేగం పెంచాలి**
**– మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి**
**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వన మహోత్సవంపై హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

ప్రజాదివాస్

యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పురోగతి, వన మహోత్సవంపై గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు చేసిన గృహాలు, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న వివరాలతో పాటు, పూర్తయిన ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ లు కలెక్టర్ కు తెలిపారు.ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు.దశల వారీగా ప్రగతిలో ఉన్న ఇండ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణాల మంజూరు ప్రక్రియలో అధికారులు అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండవ దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్,



నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని అన్నారు.

### మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మొక్కలు నాటేందుకు సరిపడా సిద్ధంగా ఉంచాలని, గుంతలు తీసి పెట్టాలని సూచించారు.టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాలలో సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

**– కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు**

ప్రజాదివాస్






అన్నీ ప్రైవేట్,ప్రభుత్వ హాస్పిటల్స్ లలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు అన్నారు, శ్రీగాధ,రాజుపేట గ్రామాలలో నలుగురు లబ్ధిదారులు లత,శిరీష,ప్రకాష్,సుష్మ,లకు మంజూరైన సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులు మొత్తం రూ రెండు లక్షల ఇరవై నాలుగు వేల అయిదు వందల రూపాయలను కాంగ్రెస్ నాయకుల తో కలిసి పర్శ హన్మాండ్లు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని మహిళలను వ్యాపారం లోకీ తీసుకువచ్చి ప్రోత్సహించి కోటీశ్వరులను చేస్తున్నారని అన్నారు,నవంబర్ నుండి కొత్త గా ఇందిరమ్మ ఇన్స్యూరెన్సు పథకం ప్రవేశపెడుతున్నారని దీనితో భూమి లేని రైతులకు కూడా 5 లక్షల బీమా అందుతున్నదన్నారు,మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను పర్శ హన్మాండ్లు కోరారు, ఈ కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్ గౌడ్,పర్శ శ్రీనివాస్,అల్లే రాజం,దిడ్డి నవీన్,పెద్ది లక్ష్మణ్,అల్లే రాజయ్య,దిడ్డి కిష్టయ్య,గౌరినేని భగవంత రావు,శ్రావణ్ రావు,నర్సింలు,బండి సత్యం,తొండ్ల నర్సింలు,స్వామి,శేఖర్,రమేష్ ,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు,

1

# ఓటర్ నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత

**– బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ రమేష్**

ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఉన్న ప్రతి ఒక్క ఓటర్ ఓటు నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ రమేష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఈ ప్రక్రియ ఆగస్టు మూడు వరకు పొడిగించడం జరిగిందని ఆయన తెలిపారు ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు ఆయన ముస్తాప నగర్ గ్రామపంచాయతీలో అర్హులైన. ఎస్ ఐ ఆర్.ట స్పెషల్ ఇంటెన్సివ్. రివిజన్ ) పారాలను నింపించి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ జాబితా తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు ప్రతి ఓటర్కు ఈ కార్యక్రమం గురించి చురుకుగా పాల్గొని నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు అలాగే 2002 2005 ఓటర్ జాబితాను అనుగుణంగా దరఖాస్తులను త్వర త్వరగా సేకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత బిఎల్ఓ లకు సూచించారు గ్రామంలో నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి అర్హులు ఎవ్వరు ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు

# ఉప సర్పంచ్ ను పరామర్శించిన గంగం

ప్రజాదివాస్



నర్మేట మండలంలోని బొమ్మాకుర్ ఉప సర్పంచ్ అంగోత్ శ్రావణ్ కుమార్ నాయక్ గత వారం రోజుల క్రితం మాజీ ఎంపీపీ దశదిన కార్యక్రమానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నా సమయంలో బొమ్మాకుర్ దుర్గమ్మ గుడి దగ్గర బైక్ స్లిప్ఐ కింద పడటంతో తలకు గాయం ఐన విషయం తెలుసుకొని వారి ఇంటికివెళ్లి పరామర్శించిన కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి
మరియు నర్మేట మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు రావుల బిక్షపతి, ఇనుగాల రవీందర్ రెడ్డి, వంగా భూపాల్ రెడ్డి, బొమ్మాకురు సర్పంచ్ చందర్ నాయక్, ఎస్టీ సేల్ జిల్లా ఉపాధ్యక్షులు భానోత్ బాలుసింగ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రజ్ఞాపూరం శ్రీధర్, లాలు, నాయక్, కాల్వ అశోక్, సత్యనారాయణ, జనర్ధాన్, తిరుపతి, సురేష్, లక్ష్మయ్య, తదితరులు కలిసి పరామర్శించడం జరిగింది.

# ఎస్ఐఆర్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి.

**కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి.**

ప్రజాదివాస్

భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ సర్ ప్రక్రియ పై నర్మేట మండలంలో (1)బొమ్మాకూర్ (2)హన్మంతపూరం (3)మల్కపేట



గ్రామాలలో నర్మేట మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు రావుల బిక్షపతి అధ్వర్యంలో నిర్వహించిన సర్ ప్రక్రియ కు ముఖ్యఅతిథి గా కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నర్సింహా రెడ్డి తో కలిసి ఎన్నికల వ్యవస్థ పై ప్రజలకు సరైన అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇనుగాల రవీందర్ రెడ్డి, వంగా భూపాల్ రెడ్డి, బొమ్మాకూర్ సర్పంచ్ చందర్,ఎస్టీ సేల్ జిల్లా ఉపాధ్యక్షులు భానోత్ బాలు సింగ్ నాయక్,అంగొత్ రవి నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు లాలు నాయక్, కాల్వ అశోక్, ప్రజ్ఞాపూరం శ్రీధర్,సత్యనారాయణ,జనర్ధాన్,తిరుపతి,సురేష్,లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మాతృత్వం కోసం ఎంతో ఎదురుచూశా: సమంత



మాతృత్వం కోసం ఎంతో ఎదురుచూశానని అగ్ర కథానాయిక సమంత అన్నారు. ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాతృత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “చాలా ఉత్సాహంగా ఉంది. నేను ఈ క్షణం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను. ‘అమ్మ’ అనే పిలుపు కోసం ఎంతో పరితపించాను. అందుకే ఈ ప్రయాణంలో నా సర్వస్వం అందించడానికి సిద్ధంగా ఉన్నాను (Samantha about motherhood). నేను జీవితంలో ప్రతి విషయంలోనూ ఆసక్తిగా ఉంటాను. ఈ ప్రయాణంలో కూడా ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాను. ప్రతి రోజూ కొత్తగా అనిపిస్తోంది. ఇకపై రాబోయే వాటన్నింటినీ స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను” అని తెలిపారు. ప్రస్తుతం సమంత (ఝుఝిఖ్ఘు) తన ఆరోగ్యం కోసం కొంతకాలం సినిమాల నుంచి విరామం తీసుకున్నారు. తన కెరీర్ గురించి సమంత మాట్లాడుతూ.. “20 ఏళ్ల తర్వాత ఎవరైనా నా సినిమాల్లో ఏదో ఒకదాన్ని చూసి ఆనందంగా ఎంజాయ్ చేస్తే అది నాకు గొప్ప అవార్డుతో సమానం. ఈ కలెక్షన్స్ కూడా ఆ అవార్డు ముందు తక్కువే. రిస్క్ తీసుకునే నటిగా, మంచి కథలను నమ్మిన వ్యక్తిగా ప్రజలు నన్ను గుర్తుంచుకోవాలని ఆశిస్తున్నా. సినిమా రంగంలోకి కొత్త వారు రావడానికి, వారిని ప్రోత్సహించడానికి నేను చిన్న మార్పునైనా చేశానని వాళ్లకి తెలిస్తే చాలు” అని తెలిపారు. ఇక ఆమె తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై కొత్త వారికి అవకాశాలు ఇస్తూ సినిమాలు నిర్మిస్తోన్న విషయం తెలిసిందే.

# ఏటి గట్టున సంజయ్ దత్



కథానాయకుడు సాయిదుర్గా తేజ్ ‘సంబరాల ఏటి గట్టు’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కే నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. తాజాగా ఈ చిత్ర ఆఖరి షెడ్యూల్ హైదరాబాద్‌లో మొదలైంది. దీనిలో భాగంగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన భారీ సెట్లో సాయితేజ్ – సంజయ్‌లపై భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ఇందులో సంజు ప్రతినాయక పాత్రని పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది 1940ల నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఇందులో సాయితేజ్ ఓ యోధుడిలా శక్తిమంతమైన మాస్ పాత్రలో అలరించనున్నారు. దీన్ని డిసెంబరులో థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతమందిస్తుండగా.. వెట్రి పళనిసామి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# 14 నెలలుగా వారణాసి కోసం పనిచేస్తున్నాను: ప్రియాంక చోప్రా



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం ‘వారణాసి’. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె (గ్రతీఱఝఱఎఝ జఫ్రశీజూతీఝ) ఈ సినిమా గురించి మాట్లాడారు. “నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో (ఝతీఝఅఖంఱ వీశీజఱవ) నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేను” అని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు.ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# ‘జన నాయగన్’ రిలీజ్ డేట్ ఫిక్స్.. బుకింగ్ యాప్ పోస్టర్




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం ‘జన నాయగన్’ విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) పునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి ‘ఏ’ సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో ‘జన నాయగన్’ ప్రేక్షకుల ముందుకు రానుంది.హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.



# పాత రోజుల్ని గుర్తు చేసింది... మిస్టర్ మిడిల్‌క్లాస్

“ఎంత ధనవంతులైనా ఏదో ఒక సందర్భంలో మధ్య తరగతి జీవితాన్ని అనుభవించినవారే. ఆ జీవితాల వెనకుండే కష్టాల్ని వినోదాత్మకంగా తెరపైకి తీసుకు రావడం ఓ గొప్ప కళ” అన్నారు శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం ‘మిస్టర్ మిడిల్‌క్లాస్’. లయ కథానాయిక. జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకుడు. జీకే, సీఎన్ నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వి.వి.వినాయక్, దశరథ్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి శ్రీకాంత్ మాట్లాడుతూ “వేంకటేశ్వర స్వామి పాత్ర లేకపోతే ఈ సినిమానే లేదు. అలాంటి గొప్ప పాత్రని రాజేంద్రప్రసాద్ చేశారు. ఈ సినిమా ప్రయాణం నా పాత రోజుల్ని గుర్తు చేసింది” అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ “ఇలాంటి గొప్ప పాత్ర చేసే అవకాశం రావడం నా అదృష్టం. శ్రీకాంత్‌తో ‘క్షేమంగా వెళ్లి లాభంగా రండి’ మొదలుకొని పలు విజయవంతమైన సినిమాలు చేశా” అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ “శ్రీకాంత్‌తో సినిమా చేయడం నాకు ఎప్పుడూ హాయిగా ఉంటుంది. రాజేంద్రప్రసాద్ ఈ సినిమాకి వెన్నెముకలా నిలిచారు” అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు అలీ, ధనరాజ్, పృథ్వీరాజ్, ఛాయాగ్రాహకుడు అంజి, సంగీత దర్శకుడు సాయికార్తీక్‌తో పాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

# తుంబాడ్ కొత్త అధ్యాయం... అలియాకి స్వాగతం



ఈ మధ్య యాక్షన్ ప్రాధాన్యమున్న చిత్రాలతోనే తెరపై మెరిసి ప్రేక్షకుల్ని అలరించింది బాలీవుడ్ అందాల తార అలియా భట్. ఇప్పుడామె తదుపరిగా హారర్ జానర్‌తో భయపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తాజాగా కొత్త కబురు వినిపించింది. సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హారర్ చిత్రం ‘తుంబాడ్ 2’లో అలియా భాగమైనట్లు ఆ చిత్రబృందం అధికారికంగా పంచుకుంది. ‘ఒక కొత్త అధ్యాయం మొదలవుతోంది.. వెల్‌కమ్ అలియా’ అనే వ్యాఖ్యలతో ఈ విషయాన్ని ఇన్‌స్టాలో వెల్లడించింది. 2018లో రాహి అనిల్ బార్వే తెరకెక్కించిన ‘తుంబాడ్’ చిత్రం విమర్శకుల ప్రశంసలు పొందిన సంగతి తెలిసిందే. దానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది డిసెంబరు 3న విడుదల కానుంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ నటిస్తున్న ఈ చిత్రానికి ఆదేశ్ ప్రసాద్ దర్శకుడు. పెన్ స్టూడియోస్, సోహుమ్ షా ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ సందర్భంగా అలియా.. “తుంబాడ్’ తొలిసారి చూసినప్పుడే నా మదిలో నిలిచిపోయింది. చాలా తక్కువ చిత్రాలు అలా సహజంగా ప్రేక్షకుల్ని కథలో లీనమయ్యేలా చేసే ప్రపంచాన్ని సృష్టిస్తాయి. ఇప్పుడా ప్రపంచంలో భాగం కావడం ప్రత్యేకంగా అనిపిస్తుంద”ని చెప్పినట్లు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకు అలియా సరైన ఎంపికని, ప్రేక్షకులు ఆమెను మునుపెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఇందులో చూపించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.